‘ఉపాధి’కి సిబ్బంది కొరత

- కొత్త పంచాయతీల్లో పనులపై తీవ్ర ప్రభావం
- ఇంకా తీరని ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత
- క్షేత్ర స్థాయిలో తప్పని అవస్థలు


దావాజిపల్లిలో పొలం చదును పనులు చేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

పాన్‌గల్: పేదలకు ఉపాధిని కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన ఉపాధిహామీ పథకం పనులు మండలంలోని పలు పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేక నత్త నడకన సాగుతున్నాయి. సరైన ప్రణాళిక లేకపోవడంతో కూలీలు పనుల్లోకి రాలేకపోతున్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించలేదు. పాత పంచాయతీల్లో ఉన్న వారితో ఆయా గ్రామాల్లో పనులు చేస్తుండగా.. కొత్త పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులే నెట్టుకొస్తున్నారు. జాబుకార్డుల మంజూరు, ఆధార్ అనుసంధానం, మస్టర్ల నిర్వహణ, పనుల గుర్తింపు వంటి వాటిల్లో అనేక ఇబ్బందులు ఎదరవుతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. ఉపాధి కూలీల మస్టర్లు, పొటోలు తీయడం, హాజరు తీసుకోవడం వంటి పనులు ఫీల్డ్ అసిస్టెంట్ చేయాల్సి ఉండగా ఆ పనులు కార్యదర్శులపై ఒత్తిడిని పెంచుతున్నాయి.

మండల పరిస్థితి..

మండలంలో 28 గ్రామ పంచాయతీలకు గాను ప్రస్తుతం కేవలం 14 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు విధులు నిర్వహిస్తున్నారు. వివిధ కారణాలతో కొంత మందిని విధుల నుంచి తొలగించారు. ఆ ఖాళీలతో పాటు నూతనంగా ఏర్పడిన 10 పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు అవసరం లేదని భావించిన ప్రభుత్వం పనుల నిర్వహణ బాధ్యతలను పంచాయతీ కార్యదర్శులకు అప్పగించింది. మండలంలో 16,078 జాబుకార్డులు ఉండగా.. మొత్తం కూలీలు 10,530, ఏటా మండలంలో రూ.6 కోట్ల విలువైన పనులు జరుగుతాయి. నూతనంగా ఏర్పడిన 10 పంచాయతీలతో పాటు పాన్‌గల్, మల్లాయిపల్లి, చిక్కేపల్లి గ్రామాల్లో కూడా ఫీల్డ్ అసిస్టెంట్లు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉపాధి పనుల నిర్వహణ నుంచి పంచాయతీ కార్యదర్శులకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ మండల పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఇటీవల ధర్నా నిర్వహించి ఎంపీడీఓకు వినతిపత్రంను అందజేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్లు లేక ఇబ్బందులు



క్షేత్ర స్థాయిలో జీపీలకు అనుగుణంగా ఫీల్డ్ అసిస్టెంట్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఒక జీపీతో పాటు మరొక జీపీల్లో పనుల కల్పన ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం స్పందించి నూతనంగా ఏర్పడిన జీపీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించి ఇబ్బందులను తొలగించాలి.

– వీరయ్య, మండల అధ్యక్షుడు, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం

ఒత్తిడి తగ్గించాలి



మండలంలో నూతనంగా ఏర్పడిన జీపీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించి పనులకు ఇబ్బందులు లేకుండా సక్రమంగా జరిగేలా చూడాలి. పంచాయతీ కార్యదర్శులు ఉపాధి పనుల నిర్వహణతో పని ఒత్తిడికి గురవుతున్నారు. దీంతో గ్రామ అభివృద్ధి పనుల మీద ఆ ప్రభావం పడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన జీపీలకు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించి ఉపాధి పనులు సాఫీగా సాగేలా చూడాలి.

– కోదండరాములు, రైతు సంఘం జిల్లా నాయకుడు

జిల్లా అధికారులకు నివేదించాం



పాత గ్రామ పంచాయతీల్లో విధులను నిర్వహించే ఫీల్డ్ అసిస్టెంట్లే నూతన జీపీల్లో విధులు నిర్వహిస్తున్న విషయం వాస్తవమే. ఈ విషయం జిల్లా అధికారుల దృష్టిలో ఉంది. కొత్త వారిని నియమిస్తే పనుల నిర్వహణ బాగుంటుంది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ముందుకు పోతాం.

– కుర్మయ్య, ఏపీఓ, పాన్‌గల్

క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



పెబ్బేరు: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పట్టణ కేంద్రానికి చెందిన మహ్మద్ ఖాజా కుటుంబానికి మైనార్టీ సభ్యులు రూ.12,500 అందజేశారు. అనంతరం బాధిత కుటుంబానికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు, పిల్లలకు విద్య కోసం మంత్రి నిరంజన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు అప్సర్, యూత్ అధ్యక్షుడు బద్రుద్దీన్, మజీద్, ఉమర్, మైనోద్దీన్, అతిఖ్ పాషా, ముజ్జు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు



ఖిల్లాఘనపురం: మద్యం తాగి వాహనాలు నడిపితే డ్రంకెన్ కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. గురువారం రాత్రి మండల కేంద్రంలో ఆయన మోటర్ సైకిళ్లపై వెళ్తున్న వారిని ఆపి డ్రంక్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం నిర్వహించిన తనిఖీల్లో ఒక్కరిపై కేసు నమోదు చేశామన్నారు.

పాఠశాలకు ఫ్యాన్ల వితరణ



అమరచింత: ఆత్మకూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డులో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వాసవీ, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో గురువారం 5 సీలింగ్ ఫ్యాన్లను అందించారు. ఈ సందర్భంగా రీజియన్ చైర్మన్ రాముని నీలేష్, వాసవీ క్లబ్ జిల్లా అధ్యక్షుడు కల్వరాజు మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని తమ వంతు సాయంగా పాఠశాలకు ఫ్యాన్లను అందించామన్నారు. వాసవీ, వనితా క్లబ్‌ల ద్వారా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కరోనా సమయంలో సైతం ప్రజలకు ఎన్నో సేవలు అందించామన్నారు. కార్యక్రమంలో పులిమామిడి రమేష్, నవీన్ , భరత్, శ్రీధర్, సుమశ్రీ, అర్చన, పాఠశాల హెచ్‌ఎం దోమ శ్రీను పాల్గొన్నారు.


ట్రాక్టర్ రివర్స్‌గేర్ పోటీలు



పెబ్బేరు: మండలంలోని రంగాపూర్‌లో ఉగాది పండుగను పురస్కరించుకొని నారమ్మ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గురువారం ట్రాక్టర్ రివర్స్ గేర్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి పెద్దమందడి మండలానికి చెందిన మైబుకు 15 తులాల వెండి, రెండో బహుమతి పెబ్బేరు మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన మండ్ల కురుమన్న 10 తులాల వెండి, మూడో బహుమతి గుమ్మడం గ్రామానికి చెందిన రవి 5 తులాల వెండి గెలుచుకున్నారు. నిర్వాహకులు విజేతలను శాలువాతో సన్మానించారు. రానున్న రోజుల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, సంజీవులు, బొజ్జన్న, రామదాసు, ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి కవులకు సన్మానం

వనపర్తి క్రైం: పట్టణానికి చెందిన ప్రముఖ కవులు బైరోజు చంద్రశేఖర్, ఉప్పరి తిరుమలేష్‌ను శాసనమండలి సభ్యుడు గోరటి వెంకన్న ఘనంగా సన్మానించి, నగదు పారితోషికాన్ని అందజేశారు. తెలంగాణ సాహిత్య అకాడమీ, భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో ‘శోభ కృత్ నామ సంవత్సర ఉగాది’ రాష్ట్రస్థాయి కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కవి సమ్మేళన కార్యక్రమానికి హాజరైన వీరు ‘తెలంగాణ సహజీవన సామరస్య విలువలు’ అనే అంశంపై కవితా గానం చేశారు. ఈ నాటి కవి సమ్మేళనంలో రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు గౌరీశంకర్, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, ప్రసిద్ధ కవి పండితులు హాజరై కవులను అభినందించారు. వనపర్తి కవులను సన్మానించడంపై సాహితీకళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్, నారాయణరెడ్డి, సత్తార్, బండారు శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు.



పౌష్టికాహారం పంపిణీలో నిర్లక్ష్యం తగదు

పాన్‌గల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రంలోని పలు రికార్డులను పరిశీలించారు. కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం పంపిణీలో ఎలాంటి అవకతవకలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పకడ్బందీగా పంపిణీ చేయాలన్నారు. అనంతరం కంటి వెలుగు శిబిరాన్ని, నర్సరీని పరిశీలించారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా క్రమం తప్పకుండా నీరు పట్టాలని, నీడ కోసం నెట్‌లను ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్మద, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


చిన్నారుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి

సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

అమరచింత: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం బస్టాండ్ ప్రధాన రహదారిపై పేపర్ లీకేజీపై నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలో ఎంతటి రాజకీయ నాయకుల ప్రమేయం ఉన్నా దర్యాప్తు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. భవిష్యత్‌లో జరగబోయే వివిధ పరీక్షలకు పర్యవేక్షణ మరింత పెంచాలని సూచించారు. ప్రభుత్వం ఐఏఎస్ నేతృత్వంలో పరీక్షల నిర్వహణ కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి పథకాన్ని వెంటనే అమలు పర్చాలన్నారు. కార్యక్రమంలో శ్యాంసుందర్, అజయ్, రమేష్, అంజి, బుచ్చన్న పాల్గొన్నారు.


నిరసన చేస్తున్న సీపీఎం నాయకులు

సీసీ రోడ్లకు ఇరువైపులా మట్టి వేయండి

అమరచింత: పట్టణంలో నూతనంగా నిర్మించిన సీసీ రహదారులకు ఇరువైపులా మట్టిని కప్పి రహదారిని సమాంతరంగా ఉంచాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని పలు వార్డుల్లో గురువారం పర్యటించి రహదారుల పరిస్థితిని పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీసీ రహదారులను నాణ్యతతో నిర్మించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని, గుత్తేదారుడిపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. రహదారులు నిర్మించిన ప్రదేశాల్లో డ్రెయినేజీలపై కల్వర్టులు నిర్మించాలన్నారు. కొత్త సీసీ రహదారులు నిర్మించి ఇరువైపులా మట్టిని వేయకపోవడంతో వర్షపు నీరు నిల్వతో ఈగలు, దోమలు పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులకు ఇరువైపులా మట్టిని వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, నాయకులు తౌఫిక్, శ్యామ్, విష్ణు, లక్ష్మీకాంత్‌రెడ్డి, ప్రకాశం, సుదర్శన్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

యువతకు ఆదర్శం భగత్‌సింగ్


వనపర్తిలో మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు


వనపర్తిలో రక్తదానం చేస్తున్న యువకులు


బుసిరెడ్డిపల్లిలో..

వనపర్తి క్రైం: స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, రాజుగురు, సుఖదేవ్‌ల త్యాగం నేటి యువతరానికి ఆదర్శమని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరేష్, డివిజన్ కార్యదర్శి గోకం వంశీ అన్నారు. గురువారం భగత్‌సింగ్ వర్ధంతిని సందర్భంగా సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాలర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రమేష్, నాయకులు విజయ్, భానుప్రకాష్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

రక్తదాన శిబిరం

షహీద్ దివస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల త్యాగాలను గుర్తు చేసుకుంటూ గురువారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, రెడ్‌క్రాస్ సమన్వయకర్త రాజేందర్, అరవింద్, సంతోష్, రమేష్, నాగరాజు తదితరులు ఉన్నారు.

వనపర్తి టౌన్: మహనీయుల సేవలు మరువలేనివని, వారి స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో టీజేఏసీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమర యోధులు రాజ్‌గురు, భగత్ సింగ్, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవి నరసింహ శర్మ, కవి నాగరాజు, ప్రజా సంఘాల ప్రతినిధులు దేవన్న నాయుడు, గణష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట: అతి చిన్న వయస్సులో దేశం కోసం ప్రాణాలర్పించిన గొప్ప వ్యక్తి భగత్‌సింగ్ అని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ అన్నారు. కొత్తకోటలోని సీఐటీయూ కార్యాలయంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకటయ్య, విజయ్, శివ, రాజు, మద్దిలేటి, శ్యాంసుందర్, శ్రీను, ఎర్రరాజు తదితరులు ఉన్నారు.

అమరచింత: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల ఆశయాలను నేటి తరం యువకులు ముందుకు తీసుకెళ్లాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా నాయకుడు ఎంపీటీసీ హన్మంతు, సీపీఎం నాయకులు వెంకటేష్, అజయ్ కోరారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా అమరచింత, నందిమళ్ల గ్రామాల్లో ఆయా పార్టీల నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రమేష్, అవినాష్, వంశీ, ఫయాజ్, ప్రజాపంథా నాయకులు వెంకటేష్, ఆంజనేయులు, ఆశన్న, మునెప్ప, చింతలన్న తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు రాము, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: మండలంలోని సంగినేనిపల్లిలో గురువారం భగత్‌సింగ్ వర్ధంతిని ప్రజాప్రతినిధులు, ప్రజలు, యువకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఇంద్రకంటి వెంకటేశ్, సర్పంచ్ మౌలాలిమీసాల మోహన్, రాంచంద్రయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో అనేక ప్రయోజనాలు


మాట్లాడుతున్న జిల్లా శిశు సంక్షేమ అధికారి రామ్మోహన్‌రెడ్డి

పెబ్బేరు: చిరుధాన్యాలతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, సాగు సుస్థిరతపై అవగాహన కల్పించాలని జిల్లా శిశు సంక్షేమ అధికారి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషణ్ అభియాన్ ఆధ్వర్యంలో పక్వాడా కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలు ఆహారంలో భాగంగా తీసుకుంటే వచ్చే ఆరోగ్య ప్రయోజనాలపై గర్భిణులు, ప్రజలు, విద్యార్థులకు పక్షం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలను, కార్యచరణ ప్రకారం ఆవాసం చేయాలని, మిల్లెట్ల పాత్రపై వ్యాసరచన, డ్రాయింగ్, న్యూట్రిషన్, ఫెయిర్ పోటీలను నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరామిరెడ్డి, ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, గోవర్ధన్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు రాధ, నర్మద, లలిత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ క్యాలెండర్ల పంపిణీ

కొల్లాపూర్: పట్టణంలోని 9వ వార్డులో గురువారం కాంగ్రెస్ పార్టీ క్యాలెండర్లను నాయకులు పంపిణీ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ నాయకులు చింతలపల్లి జగదీశ్వర్‌రావు రూపొందించిన క్యాలెండర్లను వారు ఇంటింటికీ తిరుగుతూ పంచిపెట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ నాయకులు ఎండీ పాష, లతీఫ్, పర్వేజ్ తదితరులున్నారు.

అలరించిన ఎడ్ల బండ్ల పోటీలు


వరుసగా కట్టిన బండ్లు లాగుతున్న వృషభ రాజులు

పెంట్లవెల్లి: మండల పరిధిలోని జటప్రోలులో ఉగాది పండుగ సందర్భంగా గురువారం గ్రామంలోని రైతులు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఎడ్ల బండ్ల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో 8 జతల వృషభరాజులు పాల్గొన్నాయి. మొదటి బహుమతి కుమ్మరి గాలెన్న, రెండవ బహుమతి కుమ్మరిపెద్ద శ్రీను, మూడవ బహుమతి ట్రాక్టర్ బాలయ్యలు గెలుచుకున్నారు. అలాగే గ్రామంలో ట్రాక్టర్ల రివర్స్ పందెం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ భీంరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏడాది గ్రామంలో ఆనవాయితీగా ఉగాది పండుగ రోజు కులమతాలకు అతీతంగా రైతుసంబరాలు నిర్వహించుకుంటామన్నారు. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దాతలు మాజీ ఎంపీపీ గోవింద్‌గౌడ్, వైస్ ఎంపీపీ భీంరెడ్డి, మోత్కూరి రాములు విజేతలకు ప్రోత్సహకాలు అందించారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, రాంరెడ్డి, మహానందిరెడ్డి, నాగేశ్, రాజేశ్, భారతీయుడు, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులతో ప్రజాస్వామ్యం అపహాస్యం



కొత్తకోట పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు

కొత్తకోట: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీతో నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న అధికార పార్టీని ప్రశ్నించిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని విచారణ పేరుతో సిట్ అధికారులు పిలవడాన్ని నిరసిస్తూ టీపీసీసీ ఆందోళనలకు పిలుపునిచ్చింది. దీంతో హైదరాబాద్ వెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులను గురువారం పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.ప్రశాంత్ మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత లీకేజీల పర్వం కొనసాగుతుందని మండిపడ్డారు. అభివృద్ధిని గాలికి వదిలేసి అక్రమ సంపాదనే లక్ష్యంగా అధికార పార్టీ నాయకులు పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలను విస్మరించిన సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అరెస్టయిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి బోయేజ్, పి.కృష్ణారెడ్డి, గొల్లబాబు, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ చీర్ల నాగన్నసాగర్, మేస్త్రీ శ్రీనివాసులు, రాములుయాదవ్, మోహన్‌రెడ్డి ఉన్నారు.

మదనాపురం: స్థానిక పోలీసులు టీపీసీసీ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ అంజద్‌అలీ, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జగదీష్, మండల ఉపాధ్యక్షుడు వడ్డె కృష్ణను తెల్లవారుజామున అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల పక్షాన ప్రతిపక్షం గళం విప్పితే అక్రమ అరెస్టులతో వేధిస్తున్నారని ఆందోళన చేశారు.

శ్రీరంగాపురం: మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్ వెళ్లేందుకు సిద్ధం కాగా అనుమతి లేదంటూ శ్రీరంగాపూర్ పోలీసులు వారిని ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ అక్రమ అరెస్టులు, నిర్బంధాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గోవింద్, రమేష్, పురుషోత్తం తదితరులు ఉన్నారు.


మదనాపురంలో..

అమరచింత: ఆత్మకూర్ మండలంలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులను గురువారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. గురువారం టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సిట్ దర్యాప్తుకు హాజరవుతున్న సందర్భంగా ముందస్తు చర్యల్లో భాగంగా కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేశారు. శాంతి భద్రతలో భాగంగా అరెస్టు చేసినట్లు ఏఎస్‌ఐ బీచుపల్లి తెలిపారు. అరెస్టయిన వారిలో నియోజక వర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తులసీరాజ్, నాయకులు శ్రీనివాసులు, రహమతుల్లా, గంగాధర్ పాల్గొన్నారు.

నేడు దీన్‌దయాళ్ అవార్డుల ప్రదానం

వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటు కోసం కృషి చేసిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ పురస్కార్ అవార్డులను పంపిణీ చేయనున్నట్లు మండల అభివృద్ధి అధికారి కతలప్ప తెలిపారు. ఈ అవార్డుల పంపిణీ కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీ పాల్గొంటారని మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ఈ అవార్డుల ప్రధాన కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

‘కంటివెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి


కంచిరావుపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

ఖిల్లాఘనపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ వెంకటరమణ అన్నారు. గురువారం ఖిల్లాఘనపురంలో కంటి వెలుగు శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న ఈ పథకం వలన ప్రతి ఒక్కరికీ కంటి సమస్యలు తెలియడంతో పాటుగా ఉచితంగా అద్దాలు, అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేస్తున్నామని తెలిపారు. గ్రామంలో మొత్తం 174 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 14 మందికి కంటి అద్దాలు అందించామన్నారు. అదేవిధంగా ఆరుగురికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించామని తెలిపారు.

కంచిరావుపల్లిలో..

పెబ్బేరు: కంచిరావుపల్లి పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని గురువారం ఎంపీపీ ఆవుల శైలజ, జెడ్పీటీసీ పద్మ, సర్పంచ్ సుజాత ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ భాస్కర్, నాయకులు వెంకటేష్, కురుమూర్తి, వనం రాములు, వెంకటయ్య పాల్గొన్నారు.

అవార్డుల ప్రదానోత్సవం

అమరచింత: ఆత్మకూర్, అమరచింత మండలంలోని గ్రామాల వారీగా 2021–2022 సంవత్సరానికి గాను జాతీయ స్వచ్ఛత అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆత్మకూర్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, అమరచింత ఎంపీడీఓ జ్యోతి వేర్వేరుగా తెలిపారు. పారిశుద్ధ్యం, హరితహారం, పరిశుభ్రతలో సర్పంచ్‌లు తీసుకున్న చొరవను దృష్టిలో ఉంచుకొని అవార్డులను ఎంపిక చేశామన్నారు. అవార్డులను ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అందిస్తున్నామన్నారు.

గంగమ్మ గుడి నిర్మాణానికి భూమిపూజ

కోడేరు: మండలంలోని నర్సాయిపల్లిలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ గుడి నిర్మాణానికి మత్స్యకారులు గురువారం భూమిపూజ చేశారు. త్వరలోనే గుడి నిర్మాణం పూర్తి చేస్తామని అన్నారు. గుడి నిర్మాణానికి ప్రజలు సహకరించాలని కోరారు.